క్లుప్తంగా

మహిళలు హక్కుల కోసం ఉద్యమించాలి


కార్యక్రమంలో పాల్గొన్న భాగ్యలక్ష్మి

మల్కాపురం: మహిళలు ఆర్థికంగా, ఉన్నత వ్యాపార వేత్తలుగా ఎదగాలని జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. 61వ వార్డు అంబేడ్కర్‌కాలనీలో మహిళా సాధికారతపై కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించనాడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రతి మహిళ ఉన్నత విద్యావంతురాలు కావాలని, అలాగే చైతన్యవంతురాలై తమ హక్కుల కోసం ఉద్యమించాలని సూచించారు. కార్యక్రమంలో స్త్రీ వన్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి స్టెల్లా మేరీ, అనసూయాదేవి తదితరులు పాల్గొన్నారు.

నూకరెడ్డికి పరామర్శ


నూకరెడ్డి యోగక్షేమాలు తెలుసుకుంటున్న ఆడారి ఆనంద్ కుమార్

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు ప్రాంతానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కొల్లి నూకరెడ్డికి కాళ్లకు గాయమవడంతో ఇంటి వద్దే విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ నూకరెడ్డి ఇంటి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని, తిరిగి పార్టీకి తమ సేవలను అందించాలని ఆకాంక్షించారు. నూకరెడ్డిని పరామర్శించిన వారిలో మనోహర్ తదితరులు ఉన్నారు.

'నమస్తే హ్యాండీ క్రాఫ్ట్' షాపు ప్రారంభం


హ్యాండీక్రాఫ్ట్ దుకాణాన్ని ప్రారంభిస్తున్న ఎయిర్‌పోర్టు డైరెక్టర్ రాజారెడ్డి

గోపాలపట్నం: విశాఖ విమానాశ్రయంలో నమస్తే హ్యాండీక్రాఫ్ట్ దుకాణాన్ని ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎస్.రాజారెడ్డి ప్రారంభించారు. ఎయిర్‌పోర్టు టెర్మినల్‌లో ఈ షాపును ఏర్పాటు చేశారు. వివిధ రకాల చేతి వృత్తుల వారు తయారు చేసిన వస్తువులను ఆయన పరిశీలించారు. ఈ వస్తువులు ప్రయాణికులను ఎంతగానో ఆకట్టుకుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో షాపు యజమానులు, ఎయిర్‌పోర్టు అధికారులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా పగల్‌పత్తు ఉత్సవాలు


పారాయణాలు నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై పగల్‌పత్తు ఉత్సవాలు రెండో రోజు గురువారం శాస్త్రోక్తంగా కొనసాగాయి. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను పల్లకిలో వేంజేంపచేసి ఉదయం ఆలయ బేడా మండపంలో అయ్యవారి సేవను విశేషంగా నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను ఆలయ ఆస్థాన మండపంలో వేంజేపచేశారు. దివ్యప్రబంధ పారాయణాలు పఠించారు. స్థానాచార్యుడు టి.పి.రాజగోపాల్, అధ్యాపకులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

నాడు- నేడు.. బడి అందం చూడు

- పాఠశాలల బలోపేతం
- మెరుగుపడుతున్న మౌలిక సౌకర్యాలు
- లక్ష్మీనగర్ స్కూల్‌కు రూ.19.44 లక్షలు మంజూరు
- ఇప్పటికే రూ.14.49 లక్షల పనులు పూర్తి


లక్ష్మీనగర్ మండల పరిషత్ పాఠశాల


అందుబాటులో మరుగుదొడ్లు

విశాఖ విద్య: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు పెంపొందించడమే లక్ష్యంగా చేపట్టిన నాడు–నేడు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పశ్చిమ నియోజకవర్గంలో మొదట దశలో చేపట్టగా ఇంకా, మిగిలిన పాఠశాలల్లో రెండో దశ కింద అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. భవిష్యత్ అవసరాల మేరకు పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారు. ఎన్ఏడీ సమీపంలోని 90 వార్డు లక్ష్మీనగర్–ఎఫ్ మండల పరిషత్ పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు నిర్వహిస్తున్నారు. కొండవాలు ప్రాంతం, బుచ్చిరాజుపాలెం, లక్ష్మీనగర్, రామకృష్ణా నగర్ తదితర కాలనీలకు చెందిన విద్యార్థులు ఇదే పాఠశాలల్లో విద్యనభ్యశిస్తున్నారు. 2023–24 విద్యా సంవత్సరంలో ఇక్కడ 102 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఒక పీఎస్ హెచ్‌ఎంతో పాటు, ముగ్గురు సెకండరీ గ్రేడ్ టీచర్లు అందుబాటులో ఉన్నారు. పిల్లల అభ్యున్నతి కాంక్షిస్తూ, ఇక్కడి ఉపాధ్యాయులు ఎంతో అంకితభావంతో విధులు నిర్వహిస్తున్నారు.

పట్టించుకోని గత పాలకులు

ఏటా ఇదే రీతిన ఇక్కడ విద్యార్థులు ఉన్నప్పటికీ, తగిన మౌలిక సౌకర్యాలు లేని పరిస్థితి ఉండేది. ఇక్కడ చదువుకోసమని వచ్చే వారంతా నిరుపేద, వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులే. తగిన మౌలిక సౌకర్యాలు కల్పించటంలో గత పాలకులు పెద్దగా పట్టించుకోలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు–నేడు కార్యక్రమంలో లక్ష్మీనగర్–ఎఫ్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు మంచి రోజులు వచ్చినట్లైంది.

బడుల బలోపేతమే లక్ష్యం

బడులు బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం నాడు–నేడు కార్యక్రమంకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. జీవీఎంసీ పరిధిలోని పశ్చిమ నియోజకవర్గ పరిధిలోకి వచ్చే చినగదిలి మండలంలో నాడు–నేడు రెండో దశ కింద 14 పాఠశాలలను ఎంపిక చేశారు. వీటికి సకల హంగులు కల్పించేలా రూ.6.94 కోట్లు మంజూరు చేశారు. తల్లిదండ్రుల కమిటీల భాగస్వామ్యంతో ఉపాధ్యాయుల పర్యవేక్షణలో పనులు జరుగుతున్నందున, వారిపై ఆర్థిక భారం లేకుండా ప్రభుత్వం ముందస్తుగా కొంత మొత్తంలో డబ్బులు సైతం వారి బ్యాంకు అకౌంట్లులో జమచేస్తున్నారు. దీంతో పనులు శరవేగంగా సాగుతున్నాయి.


విద్యార్థుల నోటు పుస్తకాలను పరిశీలిస్తున్న హెచ్‌ఎం నాగేశ్వరి



పాఠశాల్లో ఏర్పాటు చేసిన ఫిర్యాదు బాక్స్

రూ.19.44 లక్షలతో మౌలిక వసతులు

పాఠశాలలో విద్యార్థులు చదువులు సవ్యంగా సాగేలా మౌలిక వసతుల కల్పనకు ఉపాధ్యాయులు చేసిన ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. నాడు–నేడు రెండో దశ కింద రూ.19.44 లక్షలను మంజూరు చేశారు. తాగునీరు, ఫర్నిచర్, గ్రీన్ చాక్‌బోర్డు, విద్యుత్, మరుగుదొడ్లు ఇలా పది రకాల పనులు చేపట్టారు. ఇప్పటికే రూ.14.49 లక్షలతో పనులు పూర్తి చేశారు. మిగతా నిధులు సైతం విడుదల చేస్తే అవసరమైన మేర అన్ని రకాల వసతులు సమకూర్చుకునేలా ఇక్కడి ఉపాధ్యాయులు పనులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.



చక్కగా పాఠాలు



నేను నాల్గో తరగతి చదువుతున్నాను. మా స్కూల్లో గతంలో కంటే సౌకర్యాలు బాగున్నాయి. మా టీచర్లు చదువులు కూడా బాగా చెబుతున్నారు. పాఠాలు చక్కగా అర్థమౌతున్నాయి. బడికి వచ్చిన మాకు పుస్తకాలు, యూనీఫారాలు ఉచితంగా ఇచ్చారు. –చంచల ధనరాజ్, నాల్గో తరగతి

సౌకర్యాలు మెరుగయ్యాయి



పాఠశాలను సొంత ఇంటిలా చూసుకుంటున్నాం. నాడు–నేడు కింద నిధులు మంజూరవ్వటంతో పాఠశాలలు రూపురేఖలు మారుతున్నాయి. పాఠశాల మెయింటెన్స్ నిధులతో విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండేలా బెంచీలు, బల్లలను సమకూర్చాం. గతంలో కంటే సౌకర్యాలు బాగా మెరుగయ్యాయి.
– డీవీఎస్‌పప నాగేశ్వరి, పీఎస్.హెచ్ఎం

పాఠశాల అభివృద్ధి



పాఠశాల్లో సౌకర్యాలు సరిగా లేవని గతంలో అనేక సార్లు మా కాలనీకి చెందిన ప్రజా ప్రతినిధులకు చెప్పినా, పెద్దగా పట్టించుకోలేదు. నాడు–నేడుతో ఈ ప్రభుత్వం పాఠశాలను అభివృద్ధి చేసి, అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నందుకు తల్లిదండ్రుల తరపున కృతజ్ఞతలు చెబుతున్నాం.
–ఎం. సత్యవతి, లక్ష్మీనగర్

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నేత వర్మ


గంటా వర్మకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న వైవీ సుబ్బారెడ్డి

సింధియా: జీవీఎంసీ 40వ వార్డుకు చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, వార్డు టీడీపీ మాజీ ఉపాధ్యక్షుడు, కాపు సామాజిక వర్గానికి చెందిన గంటా వర్మ అతని అనుచరులు సుమారు 50 మందితో గురువారం వైఎస్సార్‌సీపీ చేరారు. ఈ మేరకు నగరంలో పార్టీ కార్యాలయంలో ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి చేతులమీదుగా పార్టీ కండువా కప్పుకున్నారు. 40 వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, జిల్లా వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షులు కలిదిండి భద్రినాథ్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరడం చాలా ఆనందంగా ఉందని గంటా వర్మ తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులు, పశ్చిమ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆశయాలు నచ్చి పార్టీలో చేరినట్టు తెలిపారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు వరపల మహేష్, యూత్ అధ్యక్షుడు అశోక్‌కుమార్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి మళ్లీ జగనే సీఎం కావాలి


కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ సుధ, బద్రినాథ్ తదితరులు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం, హరిజనవీధి సచివాలయం పరిధిలో గురువారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. పశ్చిమ క్లస్టర్ అధ్యక్షుడు కలిదిండి బద్రినాథ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ పాల్గొని జెండా ఎగురవేశారు. వార్డులో నాలుగేళ్లుగా జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని తెలియజేస్తూ ఏర్పాటు చేసిన బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సుధ, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బద్రినాథ్‌లు మాట్లాడుతూ జగన్ అంటే ఒక చరిత్ర అని, మాట ఇస్తే నిలబెట్టుకునే గొప్ప నాయకుడన్నారు. గత టీడీపీ పాలనలో రాష్ట్రానికి జరిగిన అభివృద్ధి కేవలం గ్రాఫిక్స్‌లకే పరిమితమైందన్నారు. పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో పార్టీ మరింత బలపడిందన్నారు. నియోజకవర్గ పరిధిలో ఆడారి ఆనంద్ కుమార్ తన సొంత ఖర్చులతో ఎనలేని సేవలను అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో 62వ వార్డు కార్పొరేటర్ బల్లా లక్ష్మణరావు, 61,62వ వార్డుల పార్టీ అధ్యక్షులు జీవీఎస్ఎన్.రాజు (కేబుల్ వాసు), భీశెట్టి గణేష్, జేసీఎస్ కన్వీనర్ భోగవల్లి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

'ఆడారి' రూ.50వేల సాయం


వెంకటరమణకు ఆర్థిక సాయం అందిస్తున్న ఆడారి శ్రీధర్, కార్పొరేటర్ ముర్రువాణి

గోపాలపట్నం: ఓ పేదింట్లో ఆనందం నింపారు వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్. శ్యాంనగర్ కాలనీకి చెందిన పోలవరపు వెంకటరమణ తన కుమార్తె ప్రత్యూషకు పెళ్లి కుదిరింది. పెళ్లి ఖర్చులకు అప్పులు చేసినా చాలలేదు. ఇటీవల 57వ వార్డులో పర్యటించిన కార్పొరేటర్ ముర్రువాణి దృష్టికి ఈ విషయం చేరింది. వెంటనే ఆడారి ఆనంద్ కుమార్ విషయం తెలియజేయగా..స్పందించిన ఆయన రూ.50వేలు ఆర్థిక సాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఆ హామీని ఆయన గురువారం నిలబెట్టుకున్నారు. మర్రిపాలెం వుడా లేఅవుట్ వైఎస్సార్‌సీపీ పశ్చిమ కార్యాలయలో ఆడారి ఆనంద్‌కుమార్ సోదరుడు ఆడారి శ్రీధర్ (చిన్న) చేతుల మీదుగా రూ.50 వేలు అందజేశారు. నగదు అందుకున్న వెంకటరమణ సంతోషం వ్యక్తం చేశాడు. నా కుమార్తె జీవితాన్ని నిలబెట్టారని కన్నీటిపర్యాంతమయ్యాడు. ఈ కార్యక్రమంలో ముర్రువాణి, కేవీ రామకృష్ణ, పిన్నింటి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పనులు పూర్తి చేయండి


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధిలో జరుగుతున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ తదితర అభివృద్ధి పనులను వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు బల్ల లక్ష్మణరావు గురువారం ఇంజినీరింగ్ వర్క్స్ డీఈ ఏడుకొండలు, ఏఈ బాబూరావులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ గుత్తేదారులకు, వర్క్ ఇన్స్పెక్టర్లకు పలు సూచనలు చేశారు. పనులు వేగంగా పూర్తి చేయాలని, నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలన్నారు. వార్డును అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించి అధికారులకు నివేదించామని, మిగిలిన పనులను కూడా త్వరితిన పూర్తి చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఆడారి ఆనంద్‌కుమార్ సారథ్యంలో తమ వార్డు శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో పబ్లిక్ వర్క్స్ ఇన్‌స్పెక్టర్ రమేష్, నాయకులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలకు మార్గం



ప్రసంగిస్తున్న రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ డే వేడుకలను గురువారం నిర్వహించారు. టీఎల్ఎన్ సభా మందిరంలో నిర్వహించిన ఈ వేడుకల్లో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ ముఖ్య అతిథిగా హాజరై నూతనంగా వర్సిటీలో ప్రవేశం పొందిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. వర్సిటీని ఆధారంగా చేసుకుని తమ ఉన్నత భవిష్యత్తుకు విద్యార్థులు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, విభాగాధిపతి ఆచార జి.వీర్రాజు, ఆచార్య పి.ప్రేమానందం, విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మల్కాపురం: శ్రీహరిపురం సబ్‌స్టేషన్ పరిధి 11 కేవీ ములగాడ ఫీడర్‌కు వార్షిక మరమ్మతులు కారణంగా ఫీడర్ పరిధిలో పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదని జోన్–2 ఈఈ బీకే నాయుడు గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ములగాడ హౌసింగ్‌కాలనీ, కుంచుమాంబ కాలనీ, పాతచెక్‌పోస్టు ఏరియా, గాజువాక డిపో, ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీ, హనుమాన్‌నగర్, గణపతినగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వివరించారు.

ఆర్ఆర్‌వీ పురం పరిధిలో..

గోపాలపట్నం: ఆర్ఆర్‌వీ పురం సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి 1 గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. బాపూజీనగర్, టైలర్స్ కాలనీ, శ్రీరామ్‌నగర్, ప్రశాంతినగర్, గోపాలపట్నం బంక్ ప్రాంతం, ఇందిరానగర్, నరసింహనగర్, గణేష్‌నగర్, గోపాలపట్నం మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందన్నారు.

ఘనంగా ఇంధన పొదుపు దినోత్సవం


ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్ మురళీమోహన్‌రావు

గోపాలపట్నం: గోపాలపట్నం ఆదిత్య కళాశాలలో జాతీయ ఇంధన పొదుపు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ కె.మురళీ మోహన్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంధన పొదుపు ఆవశ్యకతను వివరించారు. టీజీటీ పీఏవీఎస్ గణేష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఇంధనం గురించి అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.ఇంద్రనీల్, ఫిజిక్స్ హెచ్‌వోడీ బి.శ్రీవాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

అలరించిన డోజో మోజో నాటకం


డోజో మోజో నాటక ప్రదర్శన

బీచ్ రోడ్డు: రసజ్ఞ జాతీయ భాషా నాటకోత్సవాలలో భాగంగా పిఠాపురం కాలనీ కళాభారతిలో గురువారం ప్రదర్శించిన డోజో మోజో నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. విభిన్న మనస్తత్వాలు కలిగిన ముగ్గురు వ్యక్తుల కలలను కథా అంశంగా డోజో మోజో నాటిక సాగింది. ఎవరికి వారు తమ కలల్ని నిజం చేసుకోవడానికి ఇతరుల ప్రమేయం అవసరం లేదని అనుకునే ఈ ముగ్గురు వారికి తెలియకుండానే ఒకరికొకరు సహకారం చేసుకొని వారి కలల్ని నిజం చేసుకుంటారు. ఈ కథను ఎంతో రసవత్తరంగా ప్రదర్శించి ప్రేక్షకులను అలరించారు. ఈ కథను మల్లేశ్వరరావు ఆకుల అనువాదం చేశారు.

పోలీసుల అదుపులో నలుగురు వ్యక్తులు

సీతమ్మధార: ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి పూట బెదిరింపులకు పాల్పడుతున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రెండు రోజులుగా న్యూకాలనీ, తాటిచెట్లపాలెం, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో రాత్రి వేళ పాదాచారులు, వాహన చోదకులను చాకులతో బెదిరించి వారి వద్ద నుంచి నగదు వసూళ్లు చేస్తున్నారని సమాచారంతో పోలీసులు నలుగురుని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

ఓటరు జాబితా రూపకల్పనలో అలసత్వం వద్దు


వివరాలు తెలుసుకుంటున్న జేసీ విశ్వనాథన్

విశాఖ విద్య: ఓటరు జాబితాల తయారీలో అలసత్వం వహించవద్దని జాయింట్ కలెక్టర్ కేఎస్. విశ్వనాథన్ అన్నారు. జీవీఎంసీ 52వ వార్డు శాంతినగర్ సచివాలయంలో పశ్చిమ నియోజకవర్గ ఓటరు జాబితాల తయారీని గురువారం పరిశీలించారు. కొంతమంది బీఎల్‌వోలతో నేరుగా మాట్లాడారు. వారి పరిధిలో ఓటు హక్కు కల్పించేందుకు కొత్తగా ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, వాటిని ఏ మేరకు పరిశీలన చేశారనేది అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో బీఎల్‌వోలు చేపట్టిన పరిశీలన నివేదికలను చూశారు. కొంతమంది బీఎల్‌వోల వద్ద ఖాళీ ఫ్రాఫార్మాలు ఉండటాన్ని తీవ్రంగా పరిగణించి, అందుకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఓటు హక్కు కోసమని నూతనంగా వచ్చిన దరఖాస్తులు, అదే విధంగా జాబితాలో మార్పులు వంటి విషయాల్లో పూర్తిస్థాయి పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దీనిపై ఎన్నికల కమిషన్ నుంచి ఓ ప్రత్యేక అధికారుల బృందం నేరుగా క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇలా అసంపూర్తిగా దరఖాస్తులను మీ వద్దనే ఉంచుకుంటే ఎలా అని ప్రశ్నించారు. బీఎల్‌వోల పనితీరును అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు సవ్యంగా పరిశీలించాలన్నారు. ఈ విషయంలో ఏమాత్రం అలసత్వం వద్దని సూచించారు. సమావేశంలో విశాఖపట్నం ఆర్డీవో, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి హుస్సేన్ సాహెబ్, జీవీఎంసీ జోన్–5 కమిషనర్ కృష్ణ, వివిధ మండలాల అధికారులు పాల్గొన్నారు.

రూ.11 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్


భూమి పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఆడారి ఆనంద్‌కుమార్, బద్రినాథ్, పీవీ సురేష్

సింధియా: నాలుగున్నరేళ్లలో ఎవరూ చేయని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 40వ వార్డు పరిధిలోని ఏకేసీకాలనీలో వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సుమారు రూ.11.20 కోట్ల వ్యయంతో నిర్మించనున్న పలు అభివృద్ధి పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆడారి ఆనంద్ కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు కలిదిండి బద్రినాథ్ , స్థానిక నాయకులు, సచివాయల సిబ్బంది పాల్గొన్నారు.

60వ వార్డు పరిధిలో..

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు పరిధి వివిధ ప్రాంతాల్లో గురువారం జరిగిన అభివృద్ధి పనుల భూమి పూజా కార్యక్రమాల్లో ఏపీ సూక్ష్మ మధ్య చిన్న తరహా ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు. వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రినాథ్‌లు తొలుత ఇందిరాకాలనీ వద్ద రూ 19.80 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. అనంతరం వుడా కాలనీలో రూ. 37 లక్షలతో నిర్మించనున్న సీసీ డ్రైన్స్, బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం జవహర్‌నగర్ పరిధిలో రూ.19.60 లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ అధ్యక్షులు అంగ రామ్‌ప్రసాద్, ఆడారి హరీష్, సచివాలయ కన్వీనర్ ఆడారి రాజేష్, ఆకుల కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి లలితా పీఠంలో ధనుర్మాసోత్సవాలు


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మన్నవ కృష్ణసేన్

సీతంపేట: లలితానగర్‌లో లలితా పీఠంలో ఈ నెల 16 నుంచి జనవరి 14 వరకు ధనుర్మాస వ్రత మహోత్సవం జరుగుతుందని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. దీనికి సంబంధించిన కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధనుర్మాస వ్రతంలో భాగంగా కల్యాణ వెంకటేశ్వరస్వామి సన్నిధిలో ప్రతి రోజూ నిత్య కైంకర్యం, విశేష సేవలు ఉంటాయన్నారు. ప్రతి రోజూ ఉదయం 4 గంటలకు సుప్రభాతం, స్వామి, అమ్మవార్లకు అర్చన, బాల భోగ నివేదన, శాతుపాశురాల విన్నపం, గోదా చతుశ్లోకి జరుగుతాయని తెలిపారు. 23న ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం, జనవరి 3న సహస్ర దీపాలంకరణ, 11న కూడారై ఉత్సవం, 14వ తేదీ భోగి రోజున గోదా రంగనాయకుల కల్యాణం నిర్వహిస్తామన్నారు. భక్తులు విశేషా పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందాలని కోరారు.